# మట్టి

యు. సూర్యచంద్రరావు

గిరిజనుల జీవితాల్లో కొత్త వెలుగు నిండుతుందన్నది ప్రభుత్వ సంకల్పం. ఆ పరిసరాల్లో ఉన్న భూములన్నీ గిరిజనులవే. ప్రాజెక్టు నిర్మాణంలో కూలీలుగా పనిచేసే వారిలో ఎక్కువ మంది గిరిజనులే.



ఆడుతూ పాడుతూ సాగిన కాలేజి జీవితం నుంచి ఎండావానల్లో పనిచేయాల్సిన ఉద్యోగ జీవితంలోకి అడుగు పెట్టడం తొలిరోజుల్లో నాకు కష్టమనిపించేది. దానికి తోడు దబ్బవాగు ప్రాజెక్టుకు దగ్గరలో ఓ మాదిరి బస్తీ కూడా లేదు. క్యాంప్ వంట వాడు ఏమిచేస్తే అదే చచ్చినట్టు తినాల్సి వచ్చేది. అయితే నాకు ప్రకృతి సౌందర్యమంటే ఉన్న ఇష్టమే ఆ ఉద్యోగంలోని కష్టాన్ని దూరం

దీపావళి
కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

చేసింది. ప్రాజెక్టు పనితో ఒళ్లు పులిసేది. అయితేనేం అడవిలోంచి వినిపించే పక్షుల కిలకిలా రావాలు, చేరువలోని వాగుల గలగలలు, అప్పుడప్పుడూ పురివిప్పి ఆడుతూ కనిపించే నెమళ్లు, సృష్టి మర్మానికి భారీ ప్రతినిధులమన్నట్టు దూరంగా నిలిచిన ఎత్తైన కొండలూ, వాటి కొమ్ములను తాకుతూ పయనించే మబ్బులూ ఆ అలసటను మటుమాయం చేసేవి. నేను చేసే ఉద్యోగానికి రూపాయలుగా కాం ట్రాక్టర్ ఇచ్చే ప్రతిఫలం కన్నా ఎక్కువే ప్రకృతి నాకు ఇస్తోందనిపించేది.

* * *

ఓ రోజు సైట్‌లోని టెంట్‌లో కూర్చుని జరుగుతున్న పనిని చూస్తున్నాను. కూలీలు నాముందు నుంచే నెత్తిమీది గంపలతో మట్టిని మోసుకుంటూ వెళ్లి దూరంగా పోసి వస్తున్నారు. నెత్తిన బరువైన గంపతో వెళ్తున్న ఓ యువతి కన్నార్పకుండా నన్నే చూస్తూ వెళ్లింది. యధాలాపంగా ఆమె వైపు చూసిన నేను అది గమనించి ఇబ్బందిగా తల తిప్పేసుకున్నాను. ఆమె నన్ను ఎందుకంత పట్టిపట్టి చూసింది? నాలో కించిత్ కుతూహలం రేకెత్తింది. ఖాళీ గంపతో తిరిగి వచ్చేటప్పుడు ఆమెను ఓరకంట గమనించాను. మళ్లీ అలాగే ఆమె నన్ను రెప్ప వేయకుండా చూస్తోంది. ఆ కళ్లలో మెరుపు! నాకెందుకో హృదయం జల్లుమంది. గట్లు తెంచుకున్న వరద గోదావరిలా నరాల్లో నెత్తురు విచ్చలవిడిగా పరుగులెత్తింది. మనసును మత్తిల్లజేసే మధురభావన క్షణకాలం వివశుడిని చేసింది. తేరుకుని, నన్ను నేను అదుపులోకి తెచ్చుకున్నాను. అయినా ఆమె వెళ్లి, వచ్చేటప్పుడు క్రీగంట చూడకుండా ఉండలేక పోయాను. ఎన్నిసార్లైనా ఆమె చూపులతో నన్ను తడుముతూనే ఉంది. నేను గమనించానని



## రచయిత పరిచయం

శ్రీ యు. సూర్యచంద్రరావు పశ్చిమ గోదావరి జిల్లా మీనవిల్లూరులో జన్మిం చారు. శ్రీ రంగారావు శ్రీమతి సక్కుబాయి వీరి తల్లిదండ్రులు. పెద్దగా చదువుకోక పోయినా తల్లిలో తొణికిసలాడిన మానవీయ స్పందనలు, తండ్రిలో వ్యక్తమైన జిజ్ఞాస తన చేత కలం పట్టించాయని చెప్పే సూర్యచంద్రరావు గత 30 ఏళ్లుగా కథలు, కవిత్వమూ (వి-రాగి పేరుతో) వ్రాస్తున్నారు. స్వచ్ఛమైన మనుషుల్ని తయారుచేయడం రచనల పరమార్థమని, కనీసం - మనిషిలో తుచ్ఛ లక్షణాల్ని ప్రకోపింపజేయకుండా ఉండడమే రచయిత బాధ్యత అనేది వీరి అభిప్రాయం.

తెలిసినా ఆమె జంకలేదు. పైగా పెదవులు విడీవిడకుండా నవ్వసాగింది. ప్రతిసారి ఆ కళ్లలో మెరుపులు మెరుస్తూనే ఉన్నాయి. ఆ చూపుల్లోని మెరుపును మించిన నిగనిగలతో మిసమిసలాడుతోంది ఆమె మేను. ఆమెకు 18 ఏళ్లుంటాయి. దారి తప్పి అడవి నుంచి బయటపడ్డ వనకన్యలా ఉంది. ప్రకృతి ఒడిలో జరిగిన సహజమైన అందాల పోటీలో విజేతలా ఉంది. అంతటి అందగత్తెకు దక్కిన కిరీటం మట్టి గంపా? నా మనసు చివుక్కుమంది.

"అంత పరాకు మీదున్న దానివి పనికెందుకొచ్చావే ముత్తీ? తొరగా నడవ్వే. ఇలా నిక్కుతూ నీలుగుతూ నడిత్తే ఆ లేబర్ కాంటాక్టరోడు నోరు సేసుకుంటాడు" నా వైపు చూస్తూ నెమ్మదిగా నడుస్తున్న ఆ యువతిని మరో నడివయ

సామె హెచ్చరించింది. ఆ వనకన్య పేరు 'ముత్తి' అన్నమాట!

* * *

నీరు పల్లానికి ప్రవహించినట్టు అప్పట్నుంచి ప్రతిరోజూ నా చూపులు ముత్తి ఎక్కడుందో వెతుకుతూ ప్రయాణించేవి. నన్ను చూసినప్పుడల్లా ఆమె కళ్లు ఉషోదయ వేళ లేత సూర్యకిరణం సోకిన మంచుబొట్లలా మిలమిలలాడేవి. ఆమె చూపుల భాష క్రమంగా నాకు కరతలామలకమైంది. కనురెప్పలే పెదవులుగా ముత్తీ నేనూ ఊసులాడుకునే వాళ్లం. ఆమె నన్ను ప్రేమిస్తోంది.

ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన ఆ నిసర్గ సుందరి మనసా వాచా కర్మణా నన్ను కోరుకుంటోంది. నా హృదయమూ, దేహమూ పురి విప్పిన నెమళ్లయ్యాయి. గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ పరిభ్రమించినట్టు నా ఆలోచనలకు ముత్తి కేంద్రబిందువు'గా మారిపోయింది. ఆమెను ఏకాంతంలో కలుసుకుని మనసులు విప్పి చెప్పుకునే అదృష్టం కోసం తపించిపోయాను.

* * *

ఆ పున్నమి రాత్రి వాగొడ్డున పెనుబండ మీద పడుకుని పండు వెన్నెలను చూస్తున్నాను. ఒకే పానశాలలో, ఒకే పాత్రలో మధువును గ్రోలుతూ మైమరిచిన పానప్రియులలా నేనూ, నాతో పాటు అడవీ కూడా వెన్నెలను తాగుతూ మౌనంగా ఉన్నాము. నాకు సమయమెంతయిందన్న స్పృహలేదు. పరిసరాల్లో ఏమవుతోందోనన్న పట్టింపే లేదు. ఉన్నట్టుండి ఎవరో వెనుక నుంచి నా రెండు కళ్లూ మూసారు. క్షణకాలం చకితుడినయ్యాను. కళ్లు మూయడంతో వెన్నెల కనుమరుగైనా చిత్రంగా స్పర్శ నా హృదయంలో కోటి సూర్యుల కాంతిని నింపినట్టనిపించింది. ఆ స్పర్శ ఎన్నో జన్మల నుంచి నేను అనుభవించిందేననిపించింది.

"ఎవరూ?" చేతులను తొలగించే ప్రయత్నం చేయకుండానే అడిగాను.

"సెప్పుకో సూద్దాం రాంబాబూ!" ఆ గొంతు నేను ఎన్నడూ విన్నది కాదు. అయినా ఇంతవరకూ నేను విన్న అన్ని గొంతులకన్నా సుపరిచితంగా అనిపించింది.

'ఈ కొండగూడెంలో ఇంత చనువుగా నా కళ్లు మూసేవారెవరుంటారు నా ముత్తి తప్ప!' అమృతవర్షంలో తడుస్తూ పులకరిస్తున్న వేళ దేవకన్య ప్రత్యక్షం కావడం ఎంత అదృష్టం!

"ముత్తీ!" సంతోషభారంతో నా గొంతు వణికింది.

కళ్ల మీంచి చేతులు తీసి, కళ్ల ఎదుటికి వస్తూ అంది "ఔ... నేనే!" వెన్నెలలో వనదేవతలా నా ఎదుట ముత్తి! తన ఊపిరి చప్పుడు నాకు వినిపించేంత చేరువలో ముత్తి! ఓహ్! ఆమెను కౌగిలించుకుని ముద్దులతో ముంచెత్తాలన్న కోరిక లావాలా చెలరేగింది. అతికష్టం మీద అణచుకున్నాను.

"ముత్తీ! ఈ వేళప్పుడు ఇక్కడికెందుకొచ్చావు?" నాప్రశ్న నాకే వెర్రిగా ధ్వనించింది. అనూహ్యమైన అదృష్టం వరించిన వేళ దానిని ఆస్వాదించడం మాని 'ఇంత అదృష్టం నాకు ఎందుకు?' అనడం వెర్రి కాకపోతే మరేమిటి!

"మా అన్న పొగతోటకి నీరెడతన్నాడు. ఆడి కి బువ్విచ్చి వత్తన్నా!" ముత్తి చెప్పింది నిజం కాదని నాకు తెలుస్తూనే ఉంది. వెన్నెల రాత్రులు నేను ఈ బండపై చేరతానని నన్ను ఎంత కాలం నీడలా వెన్నాడి కనిపెట్టిందో! తన

మనసును నా ముందు పరచడానికి ఎంత కాలం పట్టిందో!

"ముత్తీ!" యుగాల విరహవేదనను రెండక్షరాల్లో పలికించింది నా పిలుపు! ఆ పిలుపులో దాగిన నా హృదయ నివేదనను ఆమోదించిన దేవతలా సాచిన నా చేతుల్లోకి ఒదిగిపోయింది ముత్తి. అడవే పచ్చతోరణంగా... వాగు గల గలలే మంగళ వాయిద్యాలుగా, కురిసే వెన్నెలే అక్షింతలుగా మేము ఒక్కటయ్యాం. పెను బండే మాకు పూలపానుపైంది. దూకే జలపాతానికీ, దాన్ని తనలో ఇముడ్చుకునే వాగుకీ అచ్ఛాదనలెందుకు? ఆ పానుపుపై నేను జలపాతాన్నయ్యాను. ముత్తి వాగైంది. ఆమెలోని ప్రతి అణువూ ఓ పూవు కాగా నేను యుగాలుగా ఆకలితో అలమటించిన తుమ్మెదనయ్యాను. మా మేనులు పాలుతేనెల్లా కలిసిపోయాయి. అడవిలోని లతల్లా పెనవేసుకున్నాయి. స్వరలయల్లా సమ్మిళితమయ్యాయి. ఎన్ని చేసినా యుగాల విరహభారాన్ని దించుకోవడం ఒకే ఒక్క వెన్నెల రాత్రిలో సాధ్యంకాదు కదా!

* * *

ముత్తి పువ్వయితే నేనే తావినయ్యాను. నేను జాబిలినయితే ముత్తి వెన్నెలయింది. మేము వేర్వేరు కాము. ఒకరిని విడిచి ఒకరం లేనేలేము. వీలు చిక్కినప్పుడల్లా కలుసుకుంటూనే ఉండేవాళ్లం. వాగొడ్డున పెనుబండపైనా, ఇసుక తిన్నెపైనా, అడవిలో తునికి చెట్టు నీడలో, తొగరు కొమ్మ ఊయలలో, వెదురు తోపులో, తూరుపుకొండ దాపునున్న పచ్చిక



శ్రీకాకుళంలో కథానిలయంలో 'నాకు దేవుని చూడాలని లేదు' కథల సంపుటిని ప్రముఖ కథకులు శ్రీ కాళీపట్నం రామారావు ఆవిష్కరించారు. చిత్రంలో కథల రచయిత శ్రీ కొండవలస శ్రీనివాసరావు (మధ్యన ఉన్నవారు), కథల సమీక్షకులు శ్రీ చింతాడ తిరుపతిరావు.

మైదానంలో మేము ఒకరిలోకి ఒకరం ప్రయాణించాం. శరీరాల సరిహద్దులను రద్దు చేసే సంయోగ సాధన సాగించాం. సమస్తమైన సంకెళ్లనూ తెంచుకున్న స్వేచ్ఛాజీవుల్లా భూమ్యాకాశాల నడుమనున్నదంతా మాదేనన్నట్టు ఆ అడవిలో ఎన్నో రాత్రులు సంచరించాం. చెంగున ఎగిరే లేళ్లలా ఒకరిని ఒకరం తరుముకునే వాళ్లం. చిన్నపిల్లల్లా ఆటలాడుకునే వాళ్లం. అడవి మార్మోగేలా కేరింతలు కొట్టే వాళ్లం. ఆనందం పట్టలేక ఒకరినొకరం పట్టుకుని బిగ్గరగా ఏడ్చేవాళ్లం. మేమిద్దరం ఒకరి కోసం ఒకరు జన్మలుగా నిరీక్షించు కున్నాం. వియోగ దావాగ్నిలో మొగ్గల్లా మా హృదయాలు వేగిపోయాయి. అదృష్టవశాత్తు ఒకరి కొకరం తారసపడి ఘనస్సంగమానికి నోచుకున్నాం. ఇక మమ్మల్నెవరూ వేరు చేయ లేరు. ఇది పెనుబండకన్న సుధృఢం. సూర్యు డు తూర్పున ఉదయించడం కన్న నిశ్చయం!

* * *

ముత్తీ, నేనూ చనువుగా ఉండడాన్ని కొందరు పసిగట్టేశారు. గుసగుసలు మొదలయ్యాయి. ఇక మేము జాగు చేయడానికి లేదు. ముత్తి తండ్రితో మాట్లాడాలని నిర్ణయించు కున్నాను. ఇంతలో వెంటనే రమ్మంటూ 'ఇంటి దగ్గర నుంచి కబురు. ఆ కబురుతోటే వెళ్లడా నికి కారు. సరే, ముందు మా నాన్నతోనే చెప్పి, తిరిగి వచ్చాకనే ముత్తి తండ్రితో మాట్లాడవచ్చునుకున్నాను. ఆ మాటే ముత్తితో చెప్పి వీడ్కోలు తీసుకుందామనుకున్నాను. ఎక్కడికి వెళ్లిందో, ఏమో బయల్దేరే ముందు ఎంత వెతికినా కనిపించనే లేదు. దిగులుగానే కారెక్కాను. ఇంటికి వెళ్లేసరికి అసలు విషయం తెలిసింది. నాన్నకు మరోసారి గుండెపోటు వచ్చింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చావు బతుకుల్లో ఉన్నాడు. నేను వెళ్లిన మర్నాడే నాన్న కన్నుమూసాడు. బావురుమని ఏడ్చాను. చిన్న వయసులోనే తల్లిని పోగొట్టుకున్న నన్ను నాన్న కొడుకులా కాక మిత్రునిగా చూసేవాడు. ఒక వయసు వచ్చిన నాటి నుంచి నా అభిప్రాయాలను గౌరవించేవాడు. ముత్తి గురించి చెప్పి నాన్నను ఒప్పించడం పెద్ద కష్టం కాదనుకున్నాను. ఇప్పుడు నాన్నే లేకుండా పోయాడు. అమ్మానాన్నలకు నేనొక్కడినే సంతానం. నాన్న పోయిన దుఃఖం మధ్యనే పదేపదే ముత్తి గుర్తుకు వచ్చేది. కర్మకాండలు ముగిశాక తొందరగా దబ్బవాగు వెళ్లిపోవాలి.

* * *

దాదాపు నెలరోజుల తర్వాత దబ్బవాగు వచ్చిన నా కళ్లు అణువణువునా ముత్తి కోసం వెతికాయి. ఆమె జాడ కానరాక గుండె ఉండెలు దెబ్బ తగిలిన పక్షికూనలా గిలగిల లాడింది. చివరికి ఉండబట్టలేక ప్రాజెక్టు పనికి కూలీలను తీసుకువచ్చే లేబర్ కాంట్రాక్టర్ దేవుడిని అడిగాను. దేవుడికి మా ఇద్దరి గురించి తెలుసని నాకు తెలుసు. అందుకే నా వంక కొంత వెటకారపు నవ్వుతో చూస్తూ.

“ఎవరూ బాబూ... ఆ మునిగాడి కూతురు ముత్తేనా? దానికి పెళ్లయిపోయింది కదా! ఎవరితోనో తిరిగి కడుపు తెచ్చుకుందంట! దాంతో మర్లకుంటలోని దాని బావకే ఇచ్చి అర్జంటుగా పెళ్లిచేసేసాడు ఆళ్ల అయ్య! అయినా నాకు తెలవకడుగుతాను. ఆ ముత్తి ఊసు మీకెందుకు బాబూ?” అన్నాడు దేవుడు.

నా చెవుల్లో పిడుగులు పడ్డట్టయింది. పెనుబండను ఎత్తి నామీద పడేసినట్టయింది. కొండచిలువ నా గుండెలను చుట్టుకున్నట్టయింది. వాగు ఉప్పొంగి నన్ను ముంచేసినట్ట

యింది. నా ముత్తికి పెళ్లయిపోయిందా? యుగాల వియోగం అనంతరం పునరైక్యమైన మా ఇద్దరికీ మధ్య ఇంతలోనే అనంతమైన అగాధమా? ఇక ఆ అడవీ, చెట్టూ, కొండా, వాగూ, నీరూ అన్నీ నన్ను చూసి హేళన చేస్తాయి. నా ఒంటరితనాన్ని లోకువ కట్టి చిత్రహింసలు పెడతాయి. ఈ పరిసరాలు ఇక నాకు ప్రత్యక్ష నరకాలవుతాయి. ముత్తిని చిట్టచివరిగా ఒక్కసారి చూడాలన్న కోరిక తుఫానులా చెలరేగినా అదుపుచేసుకుని దబ్బవాగు నుంచి, ఆ ఉద్యోగం నుంచీ నిష్క్రమించాను.

*   *   *

పదేళ్ల కాలంలో ఎక్కడున్నా, ఎన్ని వ్యాపకాల్లో నిమగ్నమైనా ముత్తి స్మృతులు మొగలి రేకుల్లా గుండెలను గుచ్చుకుంటూనే ఉన్నాయి. నాకెందుకో పెళ్లి చేసుకోవాలనిపించలేదు. ఒంటరిగానే కాలక్షేపం చేస్తున్నాను. మధ్య మధ్యలో ముత్తి ఎలా ఉందో చూడాలనిపించేది. అది నాకు సాధ్యమే కావచ్చు. కానీ ఆమె కాపురంలోనే కార్చిచ్చు రగులుతుంది. బలవంతంగా నా మనసును మళ్లించుకునేవాడిని. నెల రోజులుగా ఎందుకో ముత్తి జ్ఞాపకం అనుక్షణం నన్ను వెన్నాడుతోంది. దూరంగా కొండదారి మలుపులో నిలుచుని 'రాంబాబూ! ఓసారి నాదగ్గరకు రావా?' అంటూ ఆమె బలహీనమైన గొంతుతో నన్ను పిలుస్తున్నట్టు అనిపిస్తోంది. ఉండబట్టలేక కారేసుకుని దబ్బవాగు వచ్చేసాను. రోడ్డుపై కారు ఆపి తిన్నగా పెనుబండ దగ్గరకొచ్చాను.

*   *   *

గతాన్ని నెమరేసుకుంటూ వెక్కెక్కి ఏడ్చాను. 'ముత్తీ! ముత్తీ! నన్ను క్షమించు ముత్తీ!' అడవి మారుమోగేలా అరిచాను. నాతో ఇప్పుడు నా ముత్తి లేకపోవచ్చు. కానీ మా ఇద్దరినీ ఏకం చేసిన అదే ప్రకృతి ఒడిలో ఉన్నాను. నేనిప్పుడు స్వేచ్ఛాజీవిని. నాకు ఎలాంటి భయసంకోచాలూ లేవు. ఎలాంటి అడ్డుగోడల్నీ నేను ఖాతరు చేయను. అగాధాల్ని లంఘిస్తాను. ముత్తి భర్తా, కాపురం, ఇరుగు పొరుగూ, ఊరువాడా నా ప్రేమ ముందు బలాదూరు. నేనీవేళ నా ముత్తిని చూసే తీరతాను. 'ఈ రాంబాబు ఇంకా నీ రాంబాబులాగే ఉన్నా'డని చెపుతాను. కరువుతీరా నా ముత్తిని చూసుకుంటాను. తన క్షమను పొందుతాను. 'ఇలా నిశ్చయించుకున్నాక నామనసుకు పిచ్చి బలం వచ్చింది. కారెక్కి గూడెంలో లేబర్ కాంట్రాక్టర్ దేవుడింటికి వెళ్లాను. గుడిసె స్థానంలో డాబా ఇల్లుంది. దేవుడు ఇంటిదగ్గరే ఉన్నాడు.


"దేవుడూ! నన్ను గుర్తుపట్టావా? ప్రాజెక్టు కట్టినప్పుడు పని చేసిన ఇంజనీర్ రాంబాబుని!"

"రండి బాబూ! ఇలా కూర్చోండి. కారు దిగుతుండగానే మిమ్మల్ని గుర్తుపట్టా" కుర్చీ చూపుతూ అన్నాడు. నామనసు ముత్తి కోసం తపిస్తోంది. కూర్చోవడాలూ, లాంఛనాలు ఇక దుర్భరం.

"దేవుడూ! ముత్తిని చూడాలని వచ్చాను. ఆమె ఇప్పుడెక్కడుంటుంది?" సూటిగా అడిగాను.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయి అన్నాడు "ముత్తి ఇంకెక్కడుంది బాబూ! ఆ తాగుబోతు మొగుడితో వేగలేక నెల్లాళ్ల క్రితమే పురుగు మందు తాగి చచ్చిపోయింది. దాని కొడుకు ఇప్పుడు నా దగ్గరే జీతగాడిగా ఉంటున్నాడు".

"ముత్తీ!" కంఠనాళాలు తెగేలా అరిచిన నా అరుపుతో గూడెం మారుమ్రోగింది. నా ముత్తి చచ్చిపోయిందా? పాము నోట చిక్కిన




పక్షికూనలా, కాలం శూలమై గుండెల్లో గుచ్చుకున్న నిర్భాగ్యుడిలా దేవుడి ఇంటి వాకిట్లో పొరలి పొరలి ఏడ్చాను.

దేవుడూ, అతడి ఇంట్లోని వారూ నివ్వెరబోయి చూసారు. ఇరుగుపొరుగు వారు వచ్చి చేరారు.

దేవుడు నెమ్మదిగా వచ్చి నా భుజాలు పట్టుకుని "ఊరుకోండి బాబూ! దాని తనువు అలా పోవాలని రాసుంది. ఎవరు మాత్రమేం సెయ్యగలం?" ఊరడించబోయాడు. అతడి కళ్లలో జాలి తప్ప పదేళ్లక్రితం నాటి ఎగతాళి లేదు. వెక్కెక్కిపడుతూనే అతడి భుజంపై తల వాల్చాను.

"బాబూ! ఇదిగో వీడే ముత్తి కొడుకు రాజు!" అంటూ పదేళ్ల కుర్రాడిని చూపించాడు దేవుడు.

ముత్తి కొడుకా! అంటే ఆమె పేగు తెంచుకు పుట్టిన వాడు. వాడిలో ఆమె రూపాన్ని దర్శించవచ్చు! దుఃఖాన్ని అదుపు చేసుకుంటూ వెర్రి ఆత్రంతో ఆ కుర్రాడి వంక చూసాను.

వాడి ముఖంలో నా ముత్తితో పాటే మరెవరిదో సుపరిచితమైన ముఖం కనిపించింది. కొన్ని క్షణాలపాటు అదెవరిదో గుర్తు రాలేదు. 'ఆ! అవును... అది నాముఖమే! పదేళ్ల వయసులో నేనెలా ఉన్నానో అచ్చం అలాగే ఉన్నాడు రాజు.

అంటే... అంటే...! వాడు నా రక్తం పంచుకుని నా ముత్తి కడుపున పుట్టిన బిడ్డా? నా బిడ్డా?' బిత్తరపోయి చూస్తున్న రాజును వాటేసుకున్నాను.

* * *

మర్నాడు వేకువనే దబ్బవాగు నుంచి బయల్దేరాను. నిన్న నేను ఒంటరిగా ఈ ఊరు వచ్చాను. ఇప్పుడు కారులో నాపక్కన రాజు కూర్చున్నాడు. నా ఎడమచేయి తనివితీరా వాడి తల నిమురుతోంది. దూరంగా తూరుపు కొండల సందున పొద్దు పొడుస్తోంది.

ఆ లోకంలోని నా ముత్తి మోమున విరిసిన ఆనంద దరహాసంలా విచ్చుకుంటున్న వెలుగు రేఖలు!